వరద బాధితులకు పరిహారం విడుదల

కలికిరి / కడప, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించడం కోసం రూ.6.28 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. కడప, బద్వేలు, పులివెందుల డివిజన్లలో 2024 అక్టోబరులో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా నష్టపోయిన వారికి ఈ మొత్తాన్ని ఇవ్వనున్నారు. బాధితుల బ్యాంకు ఖాతాల ద్వారా నేరుగా చెల్లించేందుకు కలెక్టరు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మానవతను చాటండి

● పేదరిక నిర్మూలనకు మార్గదర్శులవ్వండి ● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మార్గదర్శులతో పీ4 గురంచి మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మానవత్వం చాటుకుని పేదరిక నిర్మూలనలో మార్గదర్శులు కావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో పీ4కు సంబంధించి జిల్లాలోని మార్గదర్శులతో కలెక్టర్ జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఉన్నతికి ప్రతి స్థాయిలో నిస్వార్థంగా సాయం చేసిన వారు ఎంతోమంది ఉంటారన్నారు. వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛందంగా మనకు చేతనైన సాయం అవసరమైన కుటుంబాలకు అందిద్దామని పిలుపునిచ్చారు. పీ4 ఫౌండేషన్ ద్వారా మనం మరో పదిమందికి సాయం చేసే అవకాశం కలుగుతుందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పీ4(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమం విధానం గురించి జిల్లాలో మార్గదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. మన సంపాదనలో కనీసం 2 నుంచి 5శాతం సమాజం కోసం ఖర్చు చేస్తే పేదరికాన్ని నిర్మూలించగలమన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రవాసాంధ్రులను భాగస్వామ్యం చేసుకుని బంగారు కుటుంబాల దత్తత ఎంపిక క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలన్నారు. ఒకవేళ స్థానికంగా మార్గదర్శులు లేకపోతే అప్పుడు స్థానికేతరులను అనుసంధానం చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో పీ4 బంగారు కుటుంబాలను గుర్తించి వారి అవసరాలను తీర్చడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సీపీవో హజరత్తయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సమూల మార్పులు

● డీఐఈఓ వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యలో సమూల మార్పులు చేసిందని డీఐఈఓ టీఎస్వీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం మరియాపురం సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యలో రిఫార్మ్స్ గురించి జిల్లాలోని అన్ని యాజమాన్య కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి తీసుకొస్తున్న మార్పులను వివరించారు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు మ్యాథమేటిక్స్‌ను అడిషనల్ సబ్జెక్టుగా ఎన్నుకొని ఎంబైపీసీ సర్టిఫికెట్‌ను పొందవచ్చన్నారు. ఈ ఏడాది నుంచి సెకండ్ లాంగ్వేజ్ ఉండదని చెప్పారు. ఈ స్థానంలో 24 సబ్జెక్టులలో దేనినైనా ఎలెక్టివ్ సబ్జెక్టుగా విద్యార్థులు ఎన్నుకోవచ్చన్నారు. అయితే ఈ ఎలెక్టివ్ సబ్జెక్ట్ మిగతా సబ్జెక్టులతో పాటు తప్పనిసరిగా ఉత్తీర్ణత కావాల్సి ఉంటుందన్నారు. ఈ సంవత్సరం ఫస్ట్ ఇయర్ జాయిన్ అయ్యే విద్యార్థులకు మేథమేటిక్స్ 1ఏ, 1బీ బదులుగా ఒకటే మేథమేటిక్స్ పేపర్ 100 మార్కులకు ఉంటుందని తెలిపారు. అలాగే బాటనీ, జువాలజీ సబ్జెక్టులకు బదులుగా కేవలం బయాలజీ మాత్రమే చదవాల్సి ఉంటుందన్నారు. ప్రశ్నాపత్రంలో కూడా మార్పులు తెస్తున్నట్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

శిక్షణ వెలవెల

● జడ్పీటీసీలు ముగ్గురు మాత్రమే హాజరు



మహిళా జడ్పీటీసీలు శిక్షణకు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 50 మంది జడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలోని 25 మంది మహిళా జడ్పీటీసీలకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ కార్యాలయంలో శిక్షణ ఏర్పాటుచేశారు. మొదటి రోజు శిక్షణకు కేవలం ముగ్గురు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. వీరిలో ప్రొద్దుటూరు జడ్పీటీసీ, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ జేష్ఠాది శారద, కొండాపురం, రాజుపాలెం జడ్పీటీసీలు మాత్రమే వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ఆ ముగ్గురు కూడా శిక్షణకు హాజరుకాలేదు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో మహిళా జడ్పీటీసీల భాగస్వామ్యం, నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. గ్రామీణ భవిష్యత్ నిర్మాణంలో మహిళా జడ్పీటీసీల పాత్ర మరింత కీలకంగా మార్చాలని శిక్షణ ఏర్పాటు చేసింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు పాల్గొనక పోవడం విమర్శలకు తావిస్తోంది. బుధ, గురువారం నిర్వహించే శిక్షణకైనా వీరు వస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



వైసీపీని లిక్కర్ స్కామ్ కుదిపేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఉమ్మడి జిల్లాకు చెందిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జైలుపాలయ్యారు. త్వరలోనే కీలక వైసీపీ నేతలు అరెస్టు అంటూ ప్రచారం సాగుతోంది. ఓ వైపు లిక్కర్ స్కాంతో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటే.. మరో వైపు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో నాయకత్వం కోసం నేతల మధ్య పోరు సాగుతోంది మైదుకూరు. బద్వేలు, జమ్మలమడుగులో ఈ పోరు పతాకస్థాయికి చేరడం ఆ పార్టీ శ్రేణులలో గుబులు రేపుతోంది.

వైసీపీలో ఉక్కపోత

● నేతల మధ్య ఆధిపత్యపోరు

● మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేలులో తీవ్రం



(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సొంత జిల్లా కావడంతో పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి దాకా ఆయన చెప్పిందే వేదంగా ఉండేది. ఆయన నిర్ణయాన్ని వైసీపీలో ఎవరూ ధిక్కరించేవారు కాదు. అక్కడక్కడ నేతలు, కార్యకర్తల మధ్య చిన్నచిన్న సమస్యలు వచ్చినా టీకప్పులో తుఫానులా చల్లారిపోయేవి. ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్కసారిగా ప్రతిపక్షంలోకి రావడంతో వైసీపీలో లుకలుకలు మొదలయ్యాయి. 2029లో జరిగే ఎన్నికల నాటికి ఎమ్మెల్యే సీటుకోసం ఇప్పటి నుంచే నేతల మధ్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.

మైదుకూరులో నువ్వా నేనా..

మైదుకూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి మధ్య పోరు సాగుతోంది. రామగోవిందరెడ్డి 2024లోనే మైదుకూరు ఎమ్మెల్యే టికెట్‌కోసం ప్రయత్నం చేశాడని సమాచారం. అప్పుడు రఘురామిరెడ్డికే టికెట్ ఇచ్చారు. ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. వచ్చే ఎన్నికల నాటికి రామగోవిందరెడ్డి మైదుకూరు నుంచి తన కొడుకుకు టికెట్ ఇప్పించుకోవాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. మూడురోజుల క్రితం చంద్రబాబు ఇచ్చిన బాబు ష్యూరిటీ అమలు కావడం లేదంటూ నిరసన తెలిపేందుకు బి.మఠంలో కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు ఇతర వైసీపీ నేతలను రామగోవిందరెడ్డి ఆహ్వానించారు. దీనిని మాజీ ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోయారు. రామగోవిందరెడ్డి బలప్రదర్శన కోసం ఆ నేతలను ఆహ్వానించారని భావించి ఏకంగా ఆ కార్యక్రమాన్నే రద్దు చేయించారని ప్రచారం జరుగుతోంది.

జమ్మలమడుగులో

జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మధ్య నాయకత్వ పోరు సాగుతోంది. గత ఎన్నికల్లో సుధీర్‌రెడ్డికే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ ఎన్నికలకు ముందు నుంచే అక్కడ వీరిద్దరి మధ్య నాయకత్వ పోరు సాగుతూ వస్తోంది. అక్కడ ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనంతరం.. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాలు.. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల బాధ్యతను వైసీపీ అధిష్ఠానం అప్పగించింది. దీంతో ఈ నియోజకవర్గంలో వైసీపీ క్యాడరంతా రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో సుధీర్‌రెడ్డి కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదని చెబుతారు. రామసుబ్బారెడ్డి మాత్రం ఆయనకు కేటాయించిన మండలాల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

బద్వేలులో బావబామ్మర్దులు..

బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆయనకు బామ్మర్ది వరుస అయిన నల్లేరు విశ్వనాథరెడ్డి మధ్య పోరు సాగుతోంది. డీసీ గోవిందరెడ్డి 2002లో రాజకీయ అరంగ్రేటం చేసినప్పటి నుంచి విశ్వనాథరెడ్డి ఆయన వెంటే నడుస్తున్నారు. అప్పట్లో కాంగ్రెస్ తరువాత జగన్ కుటుంబానికి గోవిందరెడ్డి నమ్మినబంటుగా ఉన్నారు. అయితే గత ఏడాది ఎన్నికలకు ముందు నుంచి గోవిందరెడ్డి, విశ్వనాథరెడ్డి మధ్య మొదలైన వైరం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి వెళ్లింది. వీరి మధ్య ఆధిపత్య పోరు చల్లార్చేందుకు విశ్వనాథరెడ్డికి అదనపు సమన్వయకర్త పదవి ఇచ్చారు. అయితే గోవిందరెడ్డి కొడుకు ఆదిత్యరెడ్డి చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీన్ని ఆయన వ్యతిరేక వర్గం జీర్ణించుకోలేకుంది. విశ్వనాథరెడ్డికే నియోజకవర్గ పగ్గాలు కావాలంటూ ఆయన వర్గీయులు కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, అటు తాడేపల్లికి వెళ్లి వస్తున్నారు. వీరిని ఎంపీ బుజ్జగిస్తున్నారు. ఇటీవల కూడా తాడేపల్లిలో జగన్‌ను విశ్వనాథరెడ్డి వర్గీయులు కలిశారు. ఇప్పుడు బద్వేలు వైసీపీలో బావబామ్మర్దుల పోరు ఉప్పు నిప్పుగా మారింది. అక్కడ వైసీపీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయారు.

సెల్‌ఫోన్లు దొరకడంపై.. చర్యలు తీసుకున్నాం

● ఇకపై సెంట్రల్ జైలులో తప్పులు జరగవు

● జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్

కడప క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో తరచుగా రిమాండ్ ఖైదీ వద్ద సెల్‌ఫోన్లు దొరుకుతుండటంతో పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా ఏడుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశామని జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ అన్నారు. ఆయన మంగళవారం మధ్యాహ్నం కడప కేంద్ర కారాగారానికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. జైలు అధికారులతో సమీక్ష నిర్వహించారు. దాదాపు మూడుగంటల పాటు ఆయన అధికారులను విచారణ చేశారు. అనంతరం కేంద్ర కారాగారం వద్ద మీడియాతో మాట్లాడారు. కడప సెంట్రల్ జైలును తనిఖీ చేయడానికే విజయవాడ నుంచి వచ్చానన్నారు. ఇక్కడ పనిచేసే సీనియర్ అధికారులు, జైలు వార్డర్స్‌తో మీటింగ్ నిర్వహించి పలు భద్రతా అంశాలపై చర్చించామన్నారు. కడప సెంట్రల్ జైలులో గత మూడునెలల్లో ఖైదీల నుంచి సెల్‌ఫోన్లు దొరికాయన్నారు. పీడీ యాక్టు రిమాండు ఖైదీ వద్ద సెల్‌ఫోన్లు దొరకడంతో డీఐజీ రవికిరణ్‌తో విచారణ చేయించి ఏడుగురు సిబ్బందిని సస్పెండ్ చేశామన్నారు. ఇంకా కొంతమంది అధికారులపై విచారణ కొనసాగుతోందని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని అధికారులు, సిబ్బంది తమకు మాట ఇచ్చారని.. ఆ మేరకు అందరూ ప్రమాణం చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కడప రాజమండ్రి, వైజాగ్, నెల్లూరు కేంద్ర కారాగారాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మదనపల్లెలో సత్సంగ్ వారి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కారాగారాల్లో యోగాపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా తరువాత సర్టిఫికెట్లు ఇస్తామని అన్నారు. రానున్న ఆరు నెలల్లో ప్రతి జైలు నుంచి 15 నుంచి 20 మంది ఖైదీలను యోగా శిక్షకులుగా తయారు చేస్తామన్నారు. కడప మహిళా ప్రత్యేక కారాగారంలో త్వరలో టైలరింగ్, ఎంబ్రాయిడింగ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు ఇప్పటికే అక్కడ సూపరింటెండెంట్లు ప్రతిపాదనలు పంపారని అన్నారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మద్యం సేవించి విధులకు

● ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన కలెక్టర్



మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు

కమలాపురం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రధానోపాధ్యాయుడే ఫుల్లుగా తాగేసి పాఠశాలకు వచ్చాడు. ఈ విషయం తెలిసి కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. వివరాలిలా..


వైఎస్సార్‌కడప జిల్లా కమలాపురం మండలం పెద్దచెప్పలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మంగళవారం ఫుల్లుగా మద్యం సేవించి మత్తులో తూగుతూనే పాఠశాలకు వచ్చాడు. కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తలపెట్టుకుని పడుకున్నాడు. మద్యం మత్తులో తూగుతున్న ప్రధానోపాధ్యాయుడిని మీడియా ప్రశ్నించగా మద్యం తాగడం తప్ప తాను వేరే తప్పు చేయలేదని సమర్థించుకున్నాడు. ఆయన రోజూ తాగేసి పాఠశాలకు వస్తారని ఇతర ఉపాధ్యాయులు తెలిపారు. అందరూ కలసి ఆయనను పాఠశాల నుంచి నుంచి పంపించేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులను పిలిపించి ఒక్కొక్కరి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. కాగా.. కమలాపురం మండలం పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మద్యం తాగి పాఠశాలకు వెళ్లిన విషయం ఎలక్ట్రానిక్ మీడియాలో కావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆయనను సస్పెండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీఈవో ఆదేశించారు.

శానిటేషన్‌లో.. బొక్కేసారు

● వర్కర్ల హాజరులోనూ చిలక్కొట్టుడే

● చికెన్ వేస్ట్, కుక్కల కు.ని.లోనూ కక్కుర్తి





(కడప-ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో శానిటేషన్ విభాగం చాలా కీలకమైనది. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించినది. చెత్త సేకరణ మొదలుకుని రహదారులు, డ్రైనేజీల శుభ్రంలో ఇది కీరోల్. పరిసరాలు బాగుంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటాం. అయితే ఆ విభాగమే ఇప్పుడు అవినీతికంపుతో దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడ పనిచేసే ఓ సారు అవినీతికి అంతేలేదని అంటున్నారు. ప్రజలకు భారంగా మారిన చెత్త పన్నును రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఏడాది దాటింది. అయితే శానిటేషన్ విభాగంలోని ఓ సారు సహకారంతో కొందరు సిబ్బంది నెలకు రూ.50లక్షల చొప్పున దాదాపు రూ.6 కోట్లు వసూలు చేశారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి 8 మందిపై వేటు వేశారు. ఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ప్రభుత్వానికి సరెండరు చేశారు.

అంతా చిలక్కొట్టుడే

● శానిటేషన్‌లో సుమారు 700 మంది దాకా పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు. కొందరు కార్పొరేటర్లు, ముఖ్యులు వారి బినామీలను సైతం కార్మికుల జాబితాలో చేర్చారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా కార్మికుడు వారం రోజులు విధులకు రాకపోతే అతని వేతనంలో సారు వాటా తీసుకుంటారనే ప్రచారం ఉంది.

● కార్పొరేషన్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల పేరిట కాసుల కక్కుర్తికి తెరలేపారని చెబుతారు. కుక్కలకు చేసిన కు.ని ఆపరేషన్లన్నీ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయని.. ఆ పేరుతో రూ.లక్షలు కొట్టేశారని తెలుస్తోంది.

● కడపలో సేకరించిన చికెన్ వేస్టులో కూడా గోల్‌మాల్ సాగుతున్నట్లు చెబుతారు. ఇచికన్ వేస్టేజీని చేపలు, రొయ్యలు, పందులకు వేయకూడదు. అయితే కడప నుంచి వెళ్లే చికెన్ వేస్టేజీని నంద్యాలోని పందులకు, నెల్లూరు జిల్లాలో ఉన్న చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకు గాను బాగానే చేతులు తడుస్తున్నాయన్న చర్చ నడుస్తోంది. ఇలా శానిటేషన్ విభాగంలో ప్రతిదాన్ని అవినీతికి కేరాఫ్‌గా మార్చారనే చెబుతారు.

కార్పొరేషన్ ఎంహెచ్‌వో ప్రభుత్వానికి సరెండర్



ఎం.హెచ్.వో. చంద్రశేఖర్

కడప కార్పొరేషన్‌లో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ముదిగల్ల చంద్రశేఖర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ మేరకు ఎంహెచ్‌ఓ మాతృసంస్థ అయిన ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు మంగళవారం సాయంత్రం కమిషనర్ మనోజ్‌రెడ్డి నివేదిక పంపించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కడపలో కార్పొరేషన్‌లో ఎంహెచ్‌వోగా డాక్టర్ ముదిగల్ల చంద్రశేఖర్ 2023 ఆగస్టు 30న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అతని పనితీరు సక్రమంగా లేదు. ముఖ్యంగా ఎనిమల్ బర్త్ కంట్రోల్‌లో, యాంటీరేబిస్ వ్యాక్సినేషన్ కింద కుక్కలకు స్టెరిలైజేషన్ చేసే కార్యక్రమం అమలులో విఫలమయ్యారు. వీధికుక్కల నియంత్రణ లక్ష్యాలు దెబ్బతిన్నాయి. కుక్కలకు సంబంధించి రికార్డులు లేవు. గ్రౌండ్ లెవెల్‌కు, డేటాకు చాలా తేడా ఉంది. అలాగే కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సెక్రటరీలు చెత్తపన్ను వసూలు చేస్తున్నారు. ఆ సొమ్ము ప్రభుత్వ కార్యాలయానికి చేరలేదు. దీనికంతా ఎంహెచ్‌ఓ పర్యవేక్షణ లోపం కారణంగా గుర్తించారు. కుక్కలకు స్టెరిలైజేషన్ నిబంధనల ప్రకారం జరగలేదని ఎమ్మెల్యే సైతం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపినందుకు అతనిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యపనులు సజావుగా సాగేందుకు తగిన వైద్యాధికారిని నియమించాలంటూ కమిషనర్ తన నివేదికలో కోరారు.

నేటి నుంచి నామినేషన్లు


● నాడు 50 జడ్పీటీసీ స్థానాలలో.. 36 వైసీపీకి ఏకగ్రీవం

● నేడు పోటీకి తటపటాయింపు? ● ఉప ఎన్నిక జరిగే రెండుచోట్లా వైసీపీ ఎమ్మెల్యేలే

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలకు ఆగస్టు 12న ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ రెండు స్థానాలూ వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించేవి కావడంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం లభించింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అటు రాష్ట్రంలోను, ఇటు జిల్లాలోను వెసీపీ ఘోరంగా ఓటమి పాలైంది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా, సొంత నియోజకవర్గంలో ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఈ ఎన్నికలలో సత్తా చాటేందుకు టీడీపీ సమాయత్తమైంది. మరో పక్క వైసీపీ ఉనికికోసం పాకులాడుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డితో జడ్పీలోని ఆయన చాంబర్‌లో సమావేశమయ్యారు. రాజంపేట నియోజకవర్గం పరిధిలోని ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికపై చర్చించారు. కానీ జడ్పీ చైర్మన్ ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకుంటున్నట్లు తెలిసింది. భేటీ అనంతరం జడ్పీ చైర్మన్ విమానంలో హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2021 సెప్టెంబరులో జడ్పీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నామినేషన్లు సైతం వేయనివ్వకుండా అడ్డుకున్నారు. వెరసి 50 జడ్పీటీసీ స్థానాలలో 36 స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూడా టీడీపీని ఒక్క స్థానానికి మాత్రమే పరిమితం చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలు ఏ పార్టీకి దక్కుతాయనే దానిపై జిల్లా ప్రజల్లో సైతం ఆసక్తి నెలకొంది. ఈ రెండు స్థానాలకు సంబంధించి బుధవారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జడ్పీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు జడ్పీ శాఖ ఏర్పాట్లు చేసింది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యంతో డీడీవోలు నామినేషన్లు స్వీకరించనున్నారు.

కాలగమనంలో వచ్చిన మార్పులు, భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాజులేలిన పల్లె ప్రస్తుతం శిథిలమైంది. 30 ఏళ్లకు ముందు 300 కుటుంబాలతో కళకళలాడిన ఈ గ్రామంలో ఇప్పుడు కేవలం 10 కుటుంబాలు మాత్రమే నివాసమున్నాయి. ఎంతో ఘన చరిత్ర కలిగిన సోంపాళ్యం గ్రామస్తుల వ్యథ ఇది..


16వ శతాబ్దంలో నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం



ఊరు వలస పోతాంది..!

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని సోంపాళ్యం గ్రామాన్ని విజయ నగర సామ్రాజ్యంలో కృష్ణమనాయుని వారు పాలించారు. అప్పట్లో ఆ గ్రామాన్ని పోతుపాళ్యంగా పిలిచేవారు. పోతుపాళ్యం కేంద్రంగా కృష్ణమనాయుని వారు జూలుపాళ్యం, పెద్దపాళ్యం, వెనుగొండ పాళ్యం, బంగారుపాళ్యం, దిగువపాళ్యం, ఎగువపాళ్యం, కొక్కంటి పాళ్యం తదితర 72 పాళ్యాలను పాలించేవారు. గ్రామాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి పోతుపాళ్యం చుట్టూ రక్షణ గోడలు, గ్రామంలోకి ప్రవేశించేందుకు మహాద్వారాన్ని, ఇక్కడికి దగ్గరలోనే చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయం లోపల ఏకశిలలో చెక్కిన రాతి రథం, రాతి కల్యాణమండపం ఉన్నాయి. ఆలయం ముందు 60 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం ఉంది. ఈ ధ్వజ స్తంభం దేశంలో అతి ఎత్తైన స్తంభాల్లో రెండవదిగా చెబుతారు. గోళ్లమండపం, ఊంజల్ మండపాలున్నాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ గ్రామంలో ప్రస్తుతం కూలిపోయిన కోటగోడలు, శిథిమైన ఇళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.


కోటవాకిలి మీదుగా గ్రామంలోకి వెళ్లే దారి

- రాజులేలిన గ్రామం నేడు శిథిలాలమయం..
- ఉపాధి వెతుక్కుంటూ నగరాలకు జనం..
- మిగిలింది పది కుటుంబాలే..
- నాటి వైభవానికి సాక్ష్యాలుగా కోట, మహాద్వారం..
- ఇది సోంపాళ్యం వ్యథ

క్షీణించిన ప్రాభవం

20 ఏళ్ల క్రితం గ్రామంలో 300 కుటుంబాలు నివాసముండేవి. వారంతా వ్యవసాయం ఆధారంగా జీవించేవారే. కాలక్రమంలో వ్యవసాయం ద్వారా జీవనం కష్టమైంది. పెట్టుబడులు పెరగడంతో సాగు భారంగా మారింది. దీంతో కుటుంబాలు బతుకుదెరువు కోసం పట్టణాలు, ఇతర గ్రామాలకు వలస వెళ్లాయి. గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడం కూడా కారణంగా మారింది. ప్రస్తుతం 30 కుటుంబాలు గ్రామానికి దూరంగా ఉన్న తంబళ్లపల్లె రోడ్డు పక్కన ఇళ్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్నాయి. మిగిలిన వారు బెంగళూరు, ములకలచెరువు, మదనపల్లె తదితర పట్టణాలకు వెళ్లిపోయారు. ఈ కారణాలతో ప్రస్తుతం గ్రామంలో కేవలం 10 కుటుంబాలే నివాసముంటున్నాయి. ప్రజలు ఊరు వదిలి వెళ్లడంతో ఎక్కడ చూసిన శిథిలమైన ఇళ్లు, మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఊరు కనుమరుగు అవుతోంది. గ్రామంలో ఉన్న 10 కుటుంబాలు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతే గ్రామం చరిత్రలో కలిసిపోయే అవకాశం లేకపోలేదు.

సోంపాళ్యంలోనే అతిపెద్ద సంత

20 ఏళ్ళ క్రితం సోంపాళ్యంలో అతిపెద్ద వారపు సంత జరిగేది. మదనపల్లె, శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతాల వారు కూడా సంతకు వచ్చేవారు. కాలక్రమేణా ఇక్కడ సంత జరగడం నిలిచిపోయింది. ప్రస్తుతం సోంపాళ్యంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ములకలచెరువుకు సంతకు వెళుతున్నారు.


గ్రామంలో శిథిలమైన ఇల్లు

రాజులతోనే.. ప్రాభవమూ పోయింది



విజయనగరసామ్రాజ్యంలో 72 పాళ్యాలకు కేంద్రంగా ఉండేది. ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని చెబుతారు. రాజులు పోయారు. వారితో పాటే గ్రామం ప్రాభవం కోల్పోయింది. గ్రామంలో జీవనాధారం లేకుండా పోయింది. దీంతో ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు..

- సీతయ్య, సోంపాళ్యం

ఊరు పాడుబడిపోయింది



బాగా బతికిన ఊరు పాడుబడిపోయింది. అయినా, కృష్ణమనాయుని వారు నిర్మించిన రక్షణ గోడలు, మహాద్వారం అలాగే ఉన్నాయి. బతుకు దెరువు కోసం ప్రజలు వలస వెళ్లడంతో ఊరు ఖాళీ అయింది. చుట్టుపక్కలున్న వంద గ్రామాల ప్రజలకు ఆధారంగా ఉన్న సంత ప్రస్తుతం జరగడం లేదు. గ్రామం పూర్వ వైభవం కోల్పోయింది.

-పెద్ద ఉత్తన్న, సోంపాళ్యం

రోడ్డు నిబంధనలు పాటించాలి

● ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే


వాహనదారులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలను పాటించాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో ద్విచక్ర, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో తలకు గాయాలై ఎంతోమంది మృతి చెందారన్నారు. మీ కుటుంబ సభ్యులు మీకోసం ఎదురు చూస్తున్నారన్న ఆలోచనతో వాహనాలను నడపాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు కఠినతరమయ్యాయని, జరిమానాలు అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వాహనదారులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజా, ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనంపై నిఘా కట్టుదిట్టం : డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధినుంచి ఎర్రచందనం తరలిపోకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఎర్రచందనానికి సంబంధించిన కోర్టు రికార్డులు, అటెండెన్స్, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలు ఎప్పటిప్పుడు పసిగట్టే విధంగా నిఘా కట్టుదిట్టం చేశామని, ఫారెస్ట్ ఏరియాలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్నామని, గ్రామ శివారులోని కపర్దీశ్వరకోన వద్ద ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాత్రివేళలో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డీఆర్వో ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీలేరు సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ తొలగింపు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పని చేస్తున్న పాకాల నాగభూషణంను తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాల వ్యవధితో గానీ, తొలగించే వరకూ గానీ పదవిలో కొనసాగే విధంగా 2024 మార్చి 15న ప్రభుత్వం నాగభూషణంను నియమించింది. పాలనాపరమైన సౌలభ్యం కోసం ఆయన సేవలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టరును ఆదేశించింది. కేసులకు ఆటంకం లేకుండా పొరుగు కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జీగా నియమించాలని కూడా ప్రభుత్వం కలెక్టరుకు సూచించింది. కొత్త ఏజీపీ నియామకం కోసం అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు రమణ

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన బి.రమణ (43) సోమవారం కేవీ పల్లె మండలం మఠంపల్లెలోని బంధువుల ఇంటికెళ్ళాడు. రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా కురవపల్లె వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు మీద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మర్రిపాడు మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు జయసూరి, మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి మంగళవారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కలికిరి పోలీసు హెడ్ కానిస్టేబుల్ అలీ ఖాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి యత్నం కేసులో మూడేళ్ల జైలు

లక్కిరెడ్డిపల్లె, జూలై 29(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడు పత్తి సుధాకర్‌కు మూడేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ రాయచోటి ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి డాక్టర్ ప్రసూన తీర్పు నిచ్చినట్లు లక్కిరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. పీపీ జగన్‌మోహన్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. ఎస్ఐ నరసింహారావు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ కేసు దర్యాప్తు చేశారు.

కాంపల్లెలో అక్రమంగా ఇండేన్ గ్యాస్ విక్రయం

రామాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె గ్రామం కాంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు నిలువ చేసి, బ్లాక్‌లో విక్రయిస్తున్నాడ ని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం రెండు మూడేళ్లుగా నడుస్తోందని చెబుతున్నారు. జనావాసాల్లో గ్యాస్ సిలిండర్లు నిలువ చేస్తుండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నామని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆయనను ఎన్నిసార్లు హెచ్చరించినా లెక్కపెట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు అతనితో పాటు, గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పర్తికోటకు చెందిన రేఖ(31) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు సర్వే చేస్తుండగా దాడి: నలుగురికి గాయాలు


గాయపడిన గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులతో పాటు, చూస్తున్న గ్రామస్థులపై కొందరు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. కొండామరిపల్లెకు చెందిన కొందరు తమ గ్రామానికి దారి సమస్య పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాలమేరకు మంగళవారం సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, వీఆర్వోలు సర్వే నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వరప్రసాద్, నవీన్, మునిస్వామి, రాజా, సుజాత దాడి చేశారు. ఈ దాడిలో శంకర్ రెడ్డి భార్య వసంత(33), రాజారెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి (45)సిద్ధారెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి గాయపడ్డారు. వీరిలో శంకర్‌రెడ్డికి చెవిని కొరికి వేశారు. గాయపడిన వారు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అనంతరం తాలూకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

● మండలంలో 2,731 బంగారు కుటుంబాలు గుర్తింపు ● జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణకిశోర్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణకిశోర్

పీలేరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లా పరిశ్రమల అధికారి, పీలేరు మండల స్పెషలాఫీసర్ కృష్ణకిశోర్ తెలిపారు. మంగళవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంగారు కుటుంబాల దత్తతుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరికంతో అట్టడుగు స్థానంలో ఉండి కనీస అవసరాలు తీర్చుకోలేని కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా చేయూత నివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందుకు గాను సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న వారు మార్గదర్శకులుగా ముందుకు రావాలని ఆయన కోరారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలిచి అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులు, సంస్థలు పేదరికంతో బాధపడుతున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పేదరికంలో ఉన్న 2,731 కుటుంబాలను మండలంలో గుర్తించామని తెలిపారు. ఉన్నతమైన ఆశయంలో ప్రభుత్వం పీ-4 కార్యక్రమం తీసుకొచ్చిందని, ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవితాలలో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. ఈ బృహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో పీలేరు ఎంపీడీవో జీ. శివ శంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి ఉపాధ్యాయుల లక్ష్యం కావాలి

● డీఈవో సుబ్రమణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

మదనపల్లెఅర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా విద్యాశాకాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో నిర్వహించిన జిల్లా కేజీబీవీ టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత వహించి విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించాలని ఆదేశించారు. సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను ముందుంచేలా బోధన చేయాలని చెప్పారు. కస్తూరిబా పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కేజీబీవీ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు, సమగ్ర శిక్షణ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కరుణాకర్, సమగ్ర శిక్ష పూర్వక సెక్టోరల్ అధికారి పఠాన్ మహమ్మద్‌ఖాన్, వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రాన్‌వ్యాలీ విద్యా సంస్థ చైర్మన్ నాగరాజు, డైరెక్టర్లు రంగారెడ్డి, అడ్మిన్ దివాకర్, రిసోర్స్ పర్సన్లు, పది జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పేకాట కేంద్రాల వేట..!


జ్యోతి సర్కిల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

పెద్దతిప్పసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందుకూరు, నవాబుకోట తదితర ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట జోరుగా సాగుతున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో సరిహద్దు గ్రామం .. అడ్డులేని అసాంఘికం అన్న శీర్షికతో ప్రచురితమైన వార్త కు మదనపల్లె డీఎస్పీ మహేందర్ స్పందించారు మంగళవారం స్థానిక ఎస్ఐ హరిహరప్రసాద్‌తో కలిసి మండలంలోని వివిధ ప్రాంతాల్లోని పొలాలు, కొండలు గుట్టలు తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ పేకాట, కోడిపందాలు ఆడినా, ఆడించినా అటువంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడైనా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారమందించాలన్నారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలను నేరుగా మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జ్యోతి సర్కిల్ ట్రాఫిక్‌పై డీఎస్పీ ఆగ్రహం

బి.కొత్తకోట: పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలపై మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం పర్యటించిన డీఎస్పీ ట్రాఫిక్‌తో పాటు, భద్రతా పరమైన చర్యలపై సమీక్షించారు. ద్విచక్రవాహనాలు నడి రోడ్డుపై పార్కింగ్ చేసి ఉండటం, తోపుడు బండ్లు, పూల దుకాణాలు రోడ్డుపై పెట్టి ఉండటం చూసి తక్షణం చర్యలు తీసుకోవాలని సీఐ జీవన్ గంగనాథ్ బాబును ఆదేశించారు. కొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి పట్టణ శివారులో కోడిపందేలు, పేకాట, బహిరంగంగా మద్యం సేవించడం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతామన్నారు. అనంతరం బీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడుతూ..సైబర్ క్రైం, మాదక ద్రవ్యాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ప్రైవేట్ అంబులెన్స్‌ డ్రైవర్ల బైండోవర్

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గొడవకు పాల్పడిన వారిని మంగళవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సరెండర్ చేసి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఆగస్టు నెల 13వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025-26 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్రతిష్ఠాత్మకంగా 'కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ'


విగ్రహ ప్రతిష్ఠపై చర్చిస్తున్న కమిటీ జిల్లా ప్రతినిధులు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో తిరుపతిలో నిర్వహించనున్న కనదాసు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా కనకదాసు కమిటీ కన్వీనర్ ఎం.వెంకటప్ప పిలుపు నిచ్చారు. కలికిరి మండల కనకదాసు, బీసీ సంఘం అధ్యక్షుడు వినాయకం లక్ష్మన్న ఆధ్వర్యంలో మంగళవారం కలికిరిలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో వెంకటప్ప మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా కనకదాసు అభిమానులు ప్రతిష్ఠాత్మకంగా భావించాలని కోరారు. కురబ కులానికి చెందిన వారందరూ చేయూతనివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంతో కురబల ఐక్యత సమాజానికి తెలుస్తుందన్నారు. కనకదాసు చరిత్రను వాడవాడలా ప్రచారం చేయాలని కోరారు. పలువురు ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కనకదాసు కమిటీల సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు ఎం.రెడ్డెప్ప, సి.మల్లయ్య, కలికిరి కనకదాసు కమిటీ సభ్యులు జనార్దన, గోవర్ధన్, వెంకట్రమణ, మురళి, బాబు, శంకర, రంగనాథపురం వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అటవీ సముదాయం ఆధునికీకరణ


ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో నిర్మిస్తున్న వ్యూ పాయింట్

బి.కొత్తకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీ హిల్స్‌లోని అటవీ శాఖ సముదాయం ఆధునికీకరణ పనులను అధికారులు ప్రారంభించారు. అటవీ శాఖ ప్రధాన అతిధి గృహం సమీపంలో వీఐపీల సౌకర్యార్థం మరో వ్యూ పాయింట్‌ను నిర్మిస్తున్నారు. ఈము కోళ్లు, నెమళ్లు వివిధ రకాల పక్షులను ఉంచిన షెడ్లలో మరమ్మతులు చేస్తున్నారు. మొసళ్ల పార్కు తో పాటు అ టవీ శాఖ సముదాయంలో పర్యాటకుల ఆకర్షణ కోసం వివిధ రకాల పను లు చేస్తున్నారు. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టామని అటవీ శాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి , రూ.3150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సీటీఎం గ్రామం చిలకవారిపల్లె వద్ద జూదం ఆడుతున్న సమాచారం అందడంతో మంగళవారం ఎస్ఐ చంద్రమోహన్ దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'గండికోట లిఫ్ట్ ఇరిగేషన్' బకాయిల విడుదల

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు స్టేజి-1, స్టేజి-2 లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌ల నిర్వహణకు సంబంధించిన రూ.2.91 కోట్ల బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జూలై 2023 వరకూ ఈ పంప్ హౌస్‌ల నిర్వహణ బాధ్యతను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించగా, ఆ సంస్థ బాధ్యతలను కొనసాగించిందని, దీనికి ఆమోదం తెలుపుతూ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు 2023 జూలై, అక్టోబరు, 2024 జనవరిలో అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదు. చివరగా 2024 ఆగస్టులో మరోసారి ప్రతిపాదనలను గుర్తు చేశారు. ఎట్టకేలకు పాత బకాయి నిధులను పంప్ హౌస్‌లను నిర్వహించిన మేఘా ఇంజినీరింగ్ సంస్థకు చెల్లించేందుకు తాజాగా కూటమి ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనల మేరకు రూ.2.91 కోట్లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

పెన్షన్ల కోసం... అడ్డదారులు

వాళ్లంతా చెవిటి వారు కాదు.. కాళ్లు, చేతులు సక్రమంగా లేని వైకల్యం ఉన్న వారు కాదు.. అయితే వాళ్లు మాత్రం వికలాంగులే.. ఇదే మిటని ఆశ్చర్య పోతున్నారా.. అవును నిజమే.. ఇది గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా.. వికలత్వ సర్టిఫికెట్ పొంది దర్జాగా పెన్షన్లు పొందుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పెన్షన్లపై రీ వెరిఫికేషన్‌కు అదేశించింది. అదే సమయంలో కొత్త పెన్షన్ల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో తప్పుడు పత్రాల కోసం కొందరు అనర్హులు అడ్డ దారులు తొక్కుతున్నారు. దీన్ని అసరాగా చేసుకున్న దళారులు బేరాలు సాగించి కాసులు దండుకుంటున్నారు. ఇక పెన్షన్‌కు అన్ని అర్హత లు ఉన్న నిజమైన లబ్ధిదారులకు మాత్రం పింఛన్లు మంజూరు కాక కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

- గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లు
- రీ వెరిఫికేషన్‌కు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- కొత్త పెన్షన్ల మంజూరుకు అనుమతి
- తప్పుడు పత్రాల కోసం అనర్హుల వెంపర్లాట
- అర్హులకు పింఛన్లు రాక అవస్థలు

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని వివిధ బలహీన వర్గాలకు సామాజిక భద్రత, భరోసా కల్పించడం కోసం ప్రభుత్వాలు పెన్షన్లు అందజేస్తున్నాయి. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలతోపాటు, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, నేత, కల్లుగీత కార్మికులు, డప్పుకళకారులు, కళాకారులు ఇలా అనేక రకాల పెన్ష న్లను ప్రభుత్వాలు అందచేస్తున్నాయి. మన రాష్ట్రంలోనైతే కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రతి నెల ఒకటవ తేదీ లబ్ధిదా రులకు ఇంటికి వెళ్లి పెన్షన్లు అందచేస్తోంది.. వృద్ధాప్య, వితంతు వులకు నెలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, కిడ్నీ, తలసే మియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు, పూర్తి స్థాయి లో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15వేలు అందచేస్తోంది.

పెండ్లిమర్రి మండలంలో ప్రస్తుతం 6449 మంది లబ్ధిదా రులకు దాదాపు రూ.3 కోట్లు ప్రతి నెల ప్రభుత్వం అందచేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనర్హులు పింఛన్లు పొందారు. ఈ పెన్షన్లపై పలువురు కూటమి ప్రభుత్వానికి నివేదికలు అందచేయటంతో వీరి ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్‌కు ఆదేశించింది. ఇదే దళారులకు వరంగా మారింది.

నందిమండలం గ్రామంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఇప్పటికే చాలా మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా రూ.6వేలు తీసుకుంటుండడంతో మిగతా వారు ఎలాగైనా పింఛన్ పొందాలని అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ఉద్యోగులు, కొంతమంది డాక్టర్లతో దళారులు కుమ్మక్కై సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ లో, కొత్త పెన్షన్లకు పత్రాల కోసం రూ.30వేల నుంచి బేరం మొదలు పెట్టారు. సెప్టెంబరు నెల వరకు గడువు ఉండటంతో దళారులకు వరంగా మారింది. వికలత్వం ఉంటే ఓకే, కాస్తా అటు ఇటూ ఉన్నా, తక్కువ వికలత్వం ఉంటే.. అదే దళారులకు వరంగా మారి కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మందికి కొత్త పెన్షన్లను ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో కొంత మంది ఎలాగైనా పెన్షన్లు పొందాలనే ఆశతో ఎన్ని అడ్డదారులు ఉంటే అన్ని తొక్కుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 500 నుంచి 700 మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందారు.

రెండేళ్లు కావస్తున్నా....



నేను వ్యవసాయ కూలి పనులు చేసుకొని బతుకుతున్నాను. నా భర్త చనిపోయి రెండేళ్లు కావస్తోంది. నాకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఒక సెంటు భూమి కూడా లేదు. వితంతు పెన్షన్ కావాలని అర్జీ పెట్టుకున్నా. ఇప్పటి వరకు అధికా రులు స్పందించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-ఏరాసు చిత్రావతి, నాగాయపల్లె గ్రామం

వీటన్నింటిపై అధి కారులు దృష్టి సారిస్తే పెద్దఎత్తున అనర్హులు బయటపడే అవకాశం ఉంది.



అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం

నాగాయపల్లె గ్రామానికి చెందిన మైసూరారెడ్డి, రాములమ్మ దంపతుల కుమారుడు రామసుబ్బారెడ్డి. ఇతను ఇంటర్ సెకండియర్‌లోకి రాగానే నరాలు పని చేయడం లేదు. దీంతో తిరగని ఊరు లేదు, ఆసుపత్రి లేదు. వ్యాధి మాత్రం నయం కాలేదు. డబ్బులన్నీ పోగొట్టుకొని అప్పుల పాలయ్యాం. రామసుబ్బారెడ్డి పూర్తి కదలలేని పరిస్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కేవలం వికలాంగుల పెన్షన్ రూ.6వేలు వస్తోంది. పూర్తి స్థాయిలో వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15వేలు ఇస్తున్నారు. మేము మా కుమారుని తీసుకొని ప్రతి 20 రోజులకు ఒకసారి మల విసర్జన కోసం రిమ్స్‌కు తీసుకెళ్లాలి. చాలా ఖర్చుతో కూడుకున్నది. అధికారులు మాపై దయచూపి పూర్తి పింఛన్ ఇప్పించాలి.

-మైసూరారెడ్డి, దివ్యాంగుడి తండ్రి, నాగాయపల్లె గ్రామం.

వెనకంజలో కడప.. కర్నూలు జట్లు



సాత్విక్, ప్రభాకర్

కడప స్పోర్ట్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా మంగళవారం మొదటిరోజు ఆటముగిసే సమయానికి తమ ప్రత్యర్థి జట్ల కన్నా కడప జట్టు 58 పరుగుల వెనుకబడి ఉంది. అలాగే కర్నూలు జట్టు 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. వివరాలిలా..

ఏసీఏ క్రికెట్ మైదానంలో... : కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్‌నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాత్విక్ 51 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఇందులో సిరాజుద్దీన్ 41 రన్స్‌తో క్రీజ్‌లో నాటౌట్‌గా ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 58 పరుగుల వెనుకబడి ఉంది.

కేవోఆర్ఎం మైదానంలో..: నగర శివారు ప్రాంతం కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో ప్రభాకర్ 130 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలవడం విశేషం. అనంతరం కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

సరోగసి కేంద్రాలలో తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవు

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సరోగసీ కేంద్రాలలో ఎలాంటి తప్పిదాలు జరిగినా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో సరోగసీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకున్న కేంద్రాలను కడప నగరంలో లెవల్-1,2, జమ్మలమడుగు డివిజన్లలో లెవల్ 1,2 ఏఆర్‌టీ బ్యాంకులను తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందిని, రికార్డులను తనిఖీ చేసి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సెంటర్స్‌లో ఎటువంటి తప్పిదాలు జరిగినా చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. అదే విధంగా జిల్లాలో స్త్రీ వ్యాధి నిపుణులు ఉన్న ఆసుపత్రులను ఏఆర్‌టీ లెవల్-1లో కూడా రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డాక్టర్ రేఖారావు, డాక్టర్ భవ్య, డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల్లో (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు) అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు నిరుద్యోగ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం పి.గోపాల్ రెడ్డి కోరారు. వచ్చే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమ లవుతున్న సందర్భంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు పర్సనల్ ఆఫీసర్, జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం, కడపలో తమ దరఖాస్తులను అందించాలని కోరారు. ఎంపికైన వారికి ట్రైనింగ్‌తో పాటు మెడికల్ పూర్తి చేయించి ఫిట్ అయిన వెంటనే డ్యూటీల్లోకి తీసు కుంటామన్నారు. ఇతర వివరాలకు 9959225773, 6281056690 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీడీపీ గూటికి బి.మఠం ఎంపీపీ

(కడప - ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని వైసీపీలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బి.మఠంకు చెందిన జడ్పీటీసీ సభ్యుడు, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డిల మధ్య వర్గపోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మైదుకూరు అసెంబ్లీ టికెట్‌పై రామగోవిందురెడ్డి కన్నేసినట్లు చెబుతారు. ఇదే రఘురామిరెడ్డికి జడ్పీ చైర్మన్‌ల మధ్య ఆధిపత్య పోరుకు కారణమని అంటారు. ఈ నేపథ్యంలో బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి టీడీపీలోకి చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించి టీడీపీ గూటికి వెళుతున్నట్లు వెల్లడించారు. ఇది వైసీపీకి గట్టి దెబ్బ అవుతుంది. వైసీపీ నుంచి ఎవరినంటే వాళ్లను పార్టీలోకి తీసుకోమంటూ ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు గట్టిగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో బి.మఠం ఎంపీపీ టీడీపీలోకి చేరికపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి గ్రీన్ సిగ్నల్ ఇస్తే టీడీపీలో చేర్చుకోవాలని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ భావిస్తున్నారు. ఈ చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వైసీపీకి మఠంలో మైనస్సేనని ఆ పార్టీవర్గాలు వెల్లడిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



సుభాన్ మృతదేహం

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెం దుల ప్రధాన రహదారిపై మిన్నయ్యగారిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాదెండ్ల సుభాన్ (20) అనే యువ కుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... వల్లూరు మండలం దిగు వపల్లె కొత్తపల్లె గ్రామానికి చెందిన సుభాన్, పగడాలపల్లె గ్రామానికి చెందిన పుల్లారపు హరి ద్విచక్రవాహనంలో కడ పకు బయలు దేరారు. అదే సమయంలో కడప వైపునకు ట్రాలీతో వెళుతున్న ట్రాక్టరుకు వెనుక వైపు ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సుభాన్ అక్కడికక్కడే మృతి చెందగా, హరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

ముద్దనూరు జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి జాతీయ రహదారిలోని యామవరం గ్రామం వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. యామవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్ పొలం వద్దకు వెళ్లి తిరిగివస్తున్నాడు. రోడ్డు దాటే క్రమంలో తాడిపత్రి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

1000 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

పులివెందుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చవెల్లి గ్రామ పొలాల సమీపంలో 1000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి అచ్చవెల్లి గ్రామ పొలాలలోని చెక్ డ్యామ్‌కు సమీప ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. 1000లీటర్ల నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో జూదమాడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్షరాస్యతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరాంధ్ర, అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లా, మండలస్థాయి అధికారులందరూ భాగస్వాములు కావాని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం, వయోజన విద్య ఉపసంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయం ఆవరణలోని డీపీఆర్సీ కార్యాలయంలో మంగళవారం అధికారులకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యు శాఖ ద్వారా 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 3,33,500 మంది వయోజనులైన నిరక్షరాస్యులను కడప జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించారన్నారు. మొదటి విడతగా ఈ సంవత్సరంలో 1,01,469 మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. తదుపరి 3 సంవత్సరాల్లో మొత్తం 3,33,500 మందిని వయోజనులను చేసి అక్షర్యాతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు.

వయోజన విద్య ఉపసంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూప్‌లోని మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ రాజ్యలక్ష్మి, ఏపీడీ ప్రసాద్, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ కిరణ్, జీఎస్‌డబ్ల్యు జిల్లా కో-ఆర్డినేటర్ నవనీత్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, డిఆర్‌డిఏ ఏపివోలు, డ్వామా సిఎంఎంలు, వయోజనవిద్యాశాఖ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి జయంతి మహోత్సవాలు



కలశాలకు పూజలు చేస్తున్న మఠాధిపతి వీరకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి జయంతి మహోత్సవాలను మంగళవారం మఠాధిపతి వీర శివకుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో కలశస్థాపన, హోమాలు, యజ్ఞం కుంకుమార్చనలు సాయంత్రం ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు బలిజ అన్నదాన సంఘం అధ్యక్షుడు దర్శిశెట్టి శ్రీనివాసులు, అశోక్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటం మధ్య అమ్మవారి గుడి ఉత్సవం నిర్వహించారు. మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వహ ణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ జనార్దన్

చాపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలకు ఒకసారి బ్యాంకు వినియోగదారులుతప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని యూనియన్ బ్యాంకు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జనార్దన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సంపూర్ణ ఆర్థిక అక్షరాస్యతపై జరిగిన సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పవద్దన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వెయ్యి రూపాయలు, జీవనజ్యోతి పథకం ద్వారా రూ.430 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో చాపాడు బ్యాంకు మేనేజర్ రమణ, డ్వాక్రా యానిమేటర్లు సాంబ, సుబ్బయ్య, శరత్, ఓబుళరాజు పాల్గొన్నారు.

ఫారెస్టు బీట్ ఆఫీసరు కుటుంబానికి అండగా ఉంటాం



పీసీసీఎఫ్ నాయక్ చేతుల మీదుగా ఇన్సూరెన్స్ చెక్ అందుకుంటున్న రామాంజనేయులు కుటుంబ సభ్యులు

పోరుమామిళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసరు రామాంజనేయులు కుటుంబానికి రావాలసిన బెనిఫిట్స్ వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని ఏపీ ఫారెస్టు పీసీసీఎఫ్ (ఐఎఫ్ఎఫ్) నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ, డిప్యూటీ సీఎఫ్ రామ చంద్రరావు పేర్కొన్నారు. పోరుమామిళ్ల ఫారెస్టురేంజ్‌లో పనిచేస్తూ గుండెపోటుకు గురై గత నెల (జూన్ 8న) మృతి చెందిన రామాం జనేయులు కుటుంబానికి మంగళగిరిలో సంజీవని ఇన్సూరెన్స్ ద్వారా రూ.5లక్షలు చెక్కులను వారు అందించారు. రామాంజనేయులు కుటుంబానికి సంజీవని ఇన్సూరెన్స్ రావడానికి కృషి చేసిన కడప డీఎఫ్‌వో వినీత్, పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డికి యూనిట్ ప్రెసిడెంటు కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరం నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

కొండాపురం/ మైలవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సోమవారం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా... మంగళవారం 7500 క్యూసెక్కులకు పెంచామన్నారు. మైలవరం రైతుల అవసరాల దృష్ట్యా 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 330 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోటప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని... ప్రస్తుతం 13.35 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

మైలవరం నుంచి పెన్నానదికి....

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 150 క్యూసెక్కుల మేర నీటిని మంగళవారం జలాశయ అధికారులు విడుదల చేశారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల సాగునీటి అవసరాలు, రైతుల పంట పొలాల అవసరాల నిమిత్తం మైలవరం జలాశయ ఈఈ రమేష్, డీఈ నరసింహమూర్తి, ఏఈ సుబ్బారావులు గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మైలవరం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.5 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. జలాశయం నుంచి ఉత్తర కాలువకు 60 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్





చెన్నూరు... రైతులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్, పెండ్లిమర్రి...నాగిరెడ్డిపల్లెలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసారం పెరిగేలా సేంద్రియ ఎరువులు వాడాలని, రసాయన ఎరువుల వాడకంతో భూమిలో కర్బనశాతం తగ్గి సూక్ష్మజీవుల అభివృద్ధి తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె, నరసారెడ్డిపల్లెలో వరి సాగు రైతులతో మంగళ వారం ఆయన మాట్లాడారు. ప్రతి రైతు పంటకు తగినట్లుగా ఎరువులు వాడాలి తప్ప దిగుబడి పెరుగుతుందన్న ఆలోచనతో రసాయనిక ఎరువుల ను ఇష్టానుసారంగా వాడకూడ దన్నారు. వాటి వల్ల దిగుబడి కన్నా భూసారం తగ్గి భవిష్యత్తులో భూమి నిస్సారమైపోతుందన్నారు. ప్రతి రైతు రసాయనాలు తగ్గించుకుని ద్రవ జీవామృతం, ఘన జీవామృతం తో పాటు పీఎండీఎస్ వాడాలన్నారు. అలాగే ఆరుతడి పంటల ప్రయోజనాలు, నీరు ఆదా, కరెంటు ఆదా, పిలకలు అధికంగా రావడం లాంటి వాటి గురించి వివరించారు .అలాగే జిల్లా వనరుల కేంద్రం వ్యవసా యాధికారి సుచిత్ర మాట్లాడుతూ రైతులు వాతావరణ మార్పులకనుగుణంగా వ్యవసాయ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఆగస్టు 15లోపు వరికి ప్రీమియం చెల్లించాలని తెలిపారు. అలాగే మినుముల మినీ కిట్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతు సేవకేంద్రానికి వెళ్లి తెచ్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీపీఏ కమలి రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి

వీరపునాయునిపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి తెలిపారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబుతో కలిసి కొమ్మద్దిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అనిమెల, వీరపునాయునిపల్లె, ఎన్.పాలగిరి, ఎస్.పాలగిరి, యు.రాజుపాలెం, తాటిమాకులపల్లె గ్రామాల్లో ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం అమలవుతోందన్నారు. పీఎండీఎస్-నవధాన్యాల సాగుతో 365 రోజులు పంట సాగుచేయాలని రైతులకు సూచించారు. ప్రతి ఇంటికి న్యూట్రిగార్డెన్స్, హోం కంపోస్టింగ్ అవసరమని తెలిపారు. నవ ధాన్యాల కిట్లు, న్యూట్రిగార్డెన్ల వరకు విత్తనాల ప్యాకెట్లు గ్రామ సమాఖ్య నుంచి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నాగసుధ, గంగాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

సీకేదిన్నె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లె, రసూల్‌పల్లి, రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలాలను మంగళవారం పరిశీలించారు. అక్కడి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంటల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇది సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట నష్టం నమోదుకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి జీవన్, ఉద్యాన సహాయకులు కృష్ణ చైతన్య, సాయి లక్ష్మీప్రసన్న, లాలిత్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో రాహు,కేతు పూజలు





రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు, విజయదుర్గాదేవి

కడప కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాక రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి సేవలో తరిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాహుకాల పూజలను చేశారు.

కార్మికులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గం



నగరపాలక సంస్థ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు,కార్మికులు

కడప నాగరాజుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో పోలీసులు కార్మికులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమైనచర్య అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధం నాయకులు అన్నారు. మంగళవారం కడపలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కంచుపాటి తిరుమల్, కంచుపాటి శ్రీరామ్, ఇత్తడి ప్రకాష్, డ్రైవర్ల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సుంకరి కిరణ్, వడ్లపల్లె శ్రీధర్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సర్కిల్లో నేడు అఖిలపక్షం ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో అధికారయంత్రాంగం ఘోరంగా విఫలమైందని దీనిని నివారించడానికి ఈనెల 30నకడపనగరం అంబేడ్కర్ సర్కిల్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోఉన్న ప్రభుత్వ భూములు అన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి అధికారులు సహకరిస్తున్నారన్నారు.

ఉక్కు పరిశ్రమ కుటీర పరిశ్రమ కాకుండా చూడండి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తలపెట్టిన ఉక్కుపరిశ్రమ ఒక మామూలు కుటీరపరిశ్రమ కాకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జకరయ్య, అక్రం, ఆసిఫ్‌ఖాన్, కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేసే వరకు పోరాటం

వేంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఐదేళ్లుగా విద్యుత్ సంస్థలో ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేసి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆగస్టు 7వ తేదీన విద్యుత్‌కార్మికులంతా ఛలో విజయవాడ కార్యక్రమం ఉందని, ఆ కార్యక్రమానికిసంబంధించిన గోడపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. కార్మిక నాయకులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విస్తృత అవగాహన

కడప క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది మంగళవారం పలు పాఠశాలలు, కళాశాలలల్లో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ , పోక్సోచట్టాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, డయల్ 112 సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్ బారిన పడి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు.

బస్సుల కండిషన్‌పై ప్రత్యేక దృష్టి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించనుందని అందుకు వీలుగా బస్సుల కండిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కడప ఆర్టీసీ రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం కడప ఆర్టీసీ గ్యారేజీలో విధులు నిర్వహించే మెకానిక్‌లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కల్పిస్తోందని, ఈ నేపథ్యంలో బస్సుల కండిషన్ మెరుగుపరిచేందుకు ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా మార్గమధ్యంలో బస్సులు ఎలాంటి ఫెయిల్యూరుకు గురికాకుండా ఉండేలా చూసుకోవాలన్నారు.

అభివృద్ధి,సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి,సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు.మండల పరిధిలోని నందిమండలం గ్రామంలో మంగళవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు,రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో అమలు చేయబోయే పథకాలు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,అన్నదాత సుఖీభవ అమలు కానునాయన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్ మోహన్‌రెడ్డి, , మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జ్ కిషోర్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి,శ్రీధర్‌రెడ్డి,డీలర్ చంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ద్వారా సీఎంకు లేఖ

వేంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్ర బాబుకు కార్మికులు పోస్టుకార్డు ద్వారా లేఖ రాశారు. ఆ సంఘం నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు పోస్టాఫీసు వద్దకు వెళ్లి సీఎంకు పోస్టుకార్డును పంపారు. పనులు సక్రమంగా లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వేలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని లేఖలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పులివెందులకు చేరిన బ్యాలెట్ బాక్సులు

పులివెందుల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులు మంగళవారం పులివెందులకు చేరాయి. నేటి నుంచి నామినేషన్ల దాఖలు మొదలై 12వ తేదీన ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని, 14వ తేదీ నాటికి ఎన్నిక పూర్తవుతుందని ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌లో జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినట్లు డిప్యూటీ ఎంపీడీఓ శారద తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలి

వేముల,జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, మందుల పిచికారీలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలని ఏవో ఓబులేసు రైతులకు సూచించారు. మంగళవారం మండలం లోని రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొడతాం : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న గాలి చంద్ర

కడప సెవెన్ రోడ్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజా ఉద్యమం తప్పదని స్మార్ట్ మీటర్లను ఎక్కడికక్కడ పగలగొడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర హెచ్చరించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ బిగించడంతో ఎంతోమంది విద్యుత్ వెలుగుల నుంచి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించలేక వ్యవసాయం మానుకునే స్థితి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ అంటే మొబైల్‌లాంటిదే అని ముందు రీచార్జ్ చేసుకుంటే విద్యుత్ సరఫరా ఉంటుంది లేకుంటే సరఫరా నిలిపివేస్తారని దీంతో మొత్తం చీకటిమయమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, వేణుగోపాల్ తదితరులుపాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యను పరిష్కరించండి

పులివెందుల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆటో స్టాండ్‌లు లేక ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని పులివెందుల డీఎస్పీ మురళినాయక్‌ను కోరారు. మంగళవారం మార్కెట్ యార్డు మాజీచైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డితో కలిసి ఆటోడ్రైవర్లు డీఎస్పీని కలిశారు.

హజ్‌హౌస్‌ను హజ్ 2026 ప్రారంభ బిందువుగా ప్రకటించాలి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కడప హజ్‌హౌస్‌ను హజ్2026 ప్రారంభ బిందువుగా కూటమి ప్రభుత్వం ప్రకటించాలని ముస్లిం సమైక్య వేదికరాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కడప హజ్‌హౌస్‌ను పూర్తిచేసి త్వరితతగిన ప్రారంభించాలని కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక చిలకలబావి సమీపంలో గల ముస్లిం సమాఖ్య వేదిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న హజ్‌యాత్రికులు విజయవాడకు వెళ్లి హజ్‌యాత్ర చేయడం చాలా కష్టతరంగా ఉందన్నారు. కడప హజ్‌హౌస్‌ను పూర్తిగా ఉపయోగించేందుకు వీలుగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ ఆలీషేర్, పఠాన్ రియాజ్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వేంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అరుదుగా ఉండే గండ్రంగి వానరం వేంపల్లె సాయిబాబా ఆలయం సమీపంలో మృతిచెందడంతో స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. గండి క్షేత్రం సమీపంలోని అడవుల్లో గండ్రింగి కోతులు కనిపిస్తుంటాయి. ఓ కోతి వేంపల్లెలో ఉండేది. ఎవరైన ఏదైన తినుబండారాలు ఇస్తే తినేది, ఏమాత్రం ఇబ్బందిపెట్టేది కాదు. మంగళవారం సాయిబాబా ఆలయం వద్ద మృతిచెందగా, స్థానికులు, ఆలయ ప్రతినిధి రాయవరం శివయ్య, గాలి హరిప్రసాద్, మణిగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు అంత్యక్రియలు నిర్వహించారు.

సంకల్ప బలంతో ఏదైనా సాధించగలం

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంకల్ప బలంతో ఏదైనా సాధించగలరని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలో ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడు సలీం బాషా, ఆంగ్లశాఖ విభాగాధిపతి సుజాత, విశ్రాంత అధ్యాపకుడు వెల్లాల వెంకటేశ్వరచారి, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలు సుభిక్షం

కడప ఎర్రముక్కపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడప నగరంలోని 14వ డివిజన్ ప్రకాష్ నగర్‌లో డివిజన్ ఇన్‌చార్జి దివాకర్, యువనాయకుడు ఉదయ్‌లతో కలిసి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమలేష్, యూనిట్ కన్వీనర్ ఇలియాస్, ముజీబ్, హరి తదితరులు పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

లింగాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. లింగాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు నూర్‌బాష గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సేవలు ఎంతో అవసరమన్నారు. సుదీర్ఘకాలం దేశాన్ని ముందుకు తీసుకెళ్లిన ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, ఉత్తన్న,నాగార్జున, హన్సికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం పనులను త్వరగా పూర్తిచేయాలి

వేంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని పేదలకు అందుబాటులో ఉండే టీటీడీ కళ్యాణమండపం పనులను వెంటనే పూర్తిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ సూచించారు. టీటీడీ కళ్యాణమండపం పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో పనులు త్వరగా పూర్తిచేయాలని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు మొదలుపెట్టించారు. దీంతో పనులు ప్రారంభం కాగా మంగళవారం పరిశీలించారు. బీజేపీ నాయకులు దొంతు సుమన్, సునీల్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

లింగాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితం మొత్తం నాశనం అవుతుందని లింగాల ఏఎస్‌ఐ శేషయ్య అన్నారు. మండలంలోని పెద్దకుడాల ఉన్నత పాఠశాలలో మంగళవారం స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహనకార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణయ్య , పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న చలో విద్యుత్ సౌధ

పులివెందుల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆగస్టు 7వ తేదీన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా నాయకుడు గఫూర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద గోడపత్రాలను విడుదల చేశారు. అనంతరం డీఈఈ గురుమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

పులివెందుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంలలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పులివెందుల సీఐ చాంద్‌బాష తెలిపారు. మంగళవారం పులివెందుల పరిధిలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. సీఐ మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీకెమెరాలు, సెక్యూరిటీని పెంచాలన్నారు. ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విష్ణునారాయణ ఉన్నారు.

వేంపల్లె..: అనుమానాస్పద వ్యక్తులు బ్యాంకుల వద్ద ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ నరసింహులు బ్యాంకర్లకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి అన్ని బ్యాంకుల మేనేజర్లు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. హిందూపురంలోని ఏటీఎంలో పెద్దఎత్తున నగదు అపహరణకు గురైందని తెలిపారు. బ్యాంకులు, ఏటీఎంలు వద్ద అలారం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. తప్పకుండా సెక్యూరిటీని నియమించుకోవాలని, అలాగే గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.





బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న పులివెందుల సీఐ చాంద్‌బాష, వేంపల్లి సీఐ నరసింహులు

శ్రావణమాస ఉత్సవాలకు మాజీ సీఎం జగన్‌కు ఆహ్వానం



చక్రాయపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. మంగళవారం జగన్‌ను కలిసి గండి క్షేత్రంలో జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు వర్తి రాజాస్వామి, సభ్యులు బిందుసాగర్, మధు, బ్రహ్మానందరెడ్డి,కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా పంటకాల్వలు



బెల్లగడ పంట కాల్వలో తుంగ పెరిగిన దృశ్యం

పోరుమామిళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :రియల్ఎస్టేట్ రంగంతో పంట కాల్వల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పంట పొలాలకు సకాలంలో సక్రమంగా నీరందించాలన్న ఉద్దేశ్యంతో గతంలో ఏర్పాటు చేసిన పంటకాల్వలు రానురాను కుదించుకుపోవడమే కాకుండా కొన్నిచోట్ల ఆక్రమణలతో వాటి జాడేలేకుండా పోతోంది. పంట కాల్వల మరమ్మత్తులు చేపట్టకపోవడం, ఆక్రమణలకు గురైన వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో అసలు కాల్వలు ఎక్కడ ఉన్నాయా? అని పరిశీలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోరుమామిళ్ల చెరువు ఆయకట్టు సుమారు 4400 ఎకరాలు కాగా అనధికారికంగా దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ చెరువు కింద గతంలో వెడల్పాటి పంట కాల్వలు ఉండి రంగసముద్రం రెడ్డికతవ, మల్లకతవ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరందేది. కానీ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్ల కోసం కాల్వలను పూడ్చడమో అధికార దర్పం చూపడంతో వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. పోరుమామిళ్ల చెరువు నుంచి బుగ్గబావి, ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కాల్వల ద్వారా రంగసముద్రం చెరువులోకి నీరు అందేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడంలేదు. కొందరు గృహ నిర్మాణాల కోసం ఈ పంట కాల్వలు కూడా పూడ్చివేయడంతో నీరు కింది చెరువులకు అందే పరిస్థితి లేకండాపోయింది. అంతేకాకుండా పోరుమామిళ్ల చెరవు నుంచి దమ్మన పల్లె మీదుగా మల్లకతవ, బెల్లగడ కాల్వకు రంగసముద్రం చెరువుకు గతంలో నీరందేది. ప్రస్తుతం ఆ కాల్వలన్నీ పూడిపోయి పిచ్చిమొక్కలు కనిపిస్తున్నాయి. బెల్లగడ కాల్వకు సమీపంలో వ్యర్థాలు పడవేయడంతో పూర్తిగా కాలువ అంతా కలుషితమైపోయింది. కాల్వలన్నీ పూడిపోవడంతో వర్షం నీరు ఎటు వెళ్లాలో తెలియక రోడ్లపైనే నిల్వ ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తోంది. గతంలో వర్షాలు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్టాండు ఆవరణమంతా నీటి కుంటను తలపించేలా ఉండేవి. అదే కాలవలు సక్రమంగా ఉంటే పడిన వర్షమంతా కాల్వల ద్వారా వెళితే సమస్య ఉండేది కాదు. అంతేకాక ఆర్టీసీ బస్టాండు దేశాయి థియేటరు వెనుక వైపు ఉన్న పంట పొలాలు రియల్ ఎస్టేట్ భూములుగా మారడంతో ఆ పంట కాల్వలన్నీ ఒకటో, రెండో కాల్వలు తప్ప మిగతావి కానరాని పరిస్థితి. ఇప్పటికైనా పాలకులు సంబంధిత అధికారులు పంట కాలవలను సర్వే చేసి గతంలో ఉన్న పంట కాల్వలను పునరుద్ధరించి పంట పొలాలకు చెరువులకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కాలువలను పరిశీలించి నివేదికలు పంపుతాం

పోరుమామిళ్ల చెరువుకు సంబంధించి అత్యవసర పనులు చేయించాం. పంట కాలువలకు అవసరమైన చోట్ల అంచనాలు తయారు చేసి అధికారులకు నివేదికలు పంపుతాం. కొత్త ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరైతే కాలువ పనులు చేయిస్తాం.
-సుజని, తెలుగుగంగ ఏఈ, పోరుమామిళ్ల

డైక్లోఫినాల్ సోడియం ఇంజక్షన్లు వాడవద్దు



మొబీన్
వైద్యాధికారిణి, ఖాజీపేట

ఖాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు డైక్లోపినాల్ సోడియం ఇంజక్షన్లు వాడటం వలన ఆరోజుకు నొప్పులు, జ్వరం తగ్గినప్పటికి వాటి ప్రభావం కిడ్నీలపై ప్రభావం చూపుతుందని మండల వైద్యాధికారి మొబిన్ పేర్కొన్నారు. ఏదైనా మందులు వాడవలసి వచ్చినపుడు వైద్యుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పశ్న: మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి?

జవాబు: మండల పరిధిలో 15 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

పశ్న: ఎంత మంది సిబ్బంది ఉన్నారు. కొరత ఏమైనా ఉందా ?

జవాబు: మొత్తం 77 మంది ఉన్నారని, ఖాజీపేట పీహెచ్‌సీలో అటెండర్ కొరత ఉంది.

ప్రశ్న: ప్రస్తుతం కు.ని. ఆపరేషన్లు జరుగడంలేదా. ?

జవాబు: గతంలో జరిగేవి, ప్రస్తుతం మైదుకూరు, చెన్నూరు కేంద్రాల్లో కు.ని. ఆపరేషన్లు చేస్తున్నారు.

పశ్న: మందుల కొరత ఏమైనా ఉందా? ప్రస్తుతం మందుల కొరత లేదు. రోగులకు కావాల్సిన మందులు అందిస్తున్నాం.

పశ్న: సిబ్బంది సమయపాలన పాటించడంలేదన్న విమర్శలు నిజమేనా?

జవాబు: ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, ఎవరిపైనా ఫిర్యాదులు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

పదోన్నతి పొందిన ఎస్ఐకి సన్మానం

కలసపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కలసపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మురళియాదవ్ ఎస్ఐగా పదోన్నతి పొందడంతో మంగళవారం స్టేషన్‌లో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గోవిందు, నాగార్జున, కానిస్టేబుళ్లు భాస్కర్, నారాయణరెడ్డి, శ్రీను, రాజ్‌కుమార్, సుధాకర్‌లు పాల్గొని అభినందనలు తెలిపారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి

చోరీలు జరగకుండా బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలసపాడు పోలీసులు సూచించారు. మంగళవారం బ్యాంకర్లతో హెడ్‌కానిస్టేబుల్ రామగోవిందు సమావేశమై సీసీ కెమెరాలు, అలారం అన్ని వేళల్లో పనిచేసేలా చూడాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తప్పనిసరి

రాజుపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మార్పులు జరగాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం పుణ్యక్షేత్రం వెల్లాలోని బాలికల గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో మొత్తం 27 పాఠశాలలకు గాను ఈ పాఠశాల పీఎంశ్రీ కింద ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. కేంద్ర విద్యాశాఖా మాత్యులు ధర్మేంద్ర ప్రదాన్ పీఎంశ్రీని జాతికి అంకితం చేసిన సందర్భంగా జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ వెల్లాల పాఠశాలను సందర్శించి మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థినిలు నైపుణ్యాభివృద్ధి శిక్షణను పెంపొందించుకోవాలన్నారు. వెల్లాల గురుకుల పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక కావడం పట్ల ఆయన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ అడిషనల్ కోఆర్డినేటరు సత్యానందరాజులు ఓపెన్ స్కూలు జిల్లా కోఆర్డినేటరు సాంబశివారెడ్డి, ఎఎఎల్ఎస్ కోఆర్డినేటరు భాస్కర్ యాదవ్, ఎంఈవో రామస్వా మిరెడ్డి, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వైభవోపేతంగా మంగళగౌరీ వ్రత పూజలు



మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా భక్తులు

బద్వేలుటౌన్, జులై 28 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలోని కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం మొదటి మంగళవారాన్ని పురష్కరించుకొని ఆలయ ప్రదానార్చకులు ఆధ్వర్యంలో మంగళగౌరీవ్రతాన్ని శాస్త్రోక్తంగా వైభవోపేతంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు మాట్లాడుతూ మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించిన వారికి సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

పేదల ఆర్థికాభివృద్ధి కోసం పీ4 కార్యక్రమం

బద్వేలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేదలను ఆర్థికంగా బలపరిచే కార్యక్రమమే పీ4 అని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె, సురేంద్రనగర్ గుంతపల్లెలలో పీ4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేస్తూ సంపద అధికంగా ఉన్న వారు తక్కువ సంపద ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. పీ4 కు అర్హులైన వారు సచివాలయ సిబ్బందిని సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని సంతాన సాఫల్య కేంద్రాలపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఏఆర్‌టీ, సరోగతి యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న కేంద్రాల్లో మంగళవారం పరిశీలన చేపట్టారు. సికింద్రాబాదు కేంద్రంగా వెలుగులోకి వచ్చిన ఫెర్టీ క్లినిక్‌లలోని అక్రమాల బాగోతంపై రాష్ట్రంలోని సంతానోత్పత్తి సేవలు అందిస్తున్న కేంద్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ గీత ప్రొద్దుటూరులోని లెవెల్-2 కేంద్రాలైన కాత్యానర్సింగ్‌హోమం, మాతృత్వ సంతాన సాఫల్యకేంద్రం, ఏఆర్‌టీ బ్యాంకులను పరిశీలించారు. అక్కడి ల్యాబ్‌లు, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందిని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి తప్పిదాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. స్త్రీ వ్యాధి నిపుణులు ఉన్న అన్ని ఆస్పత్రులలో ఏఆర్‌టీ లెవెల్-1 రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

అట్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని వాహనదారులకు అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ వివరించారు. మంగళవారం వాహనాల తనిఖీల్లో లైసెన్సు వాహనపత్రాలు హెల్మెట్ లేని వాహనదాఋలకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని త్రిబుల్ రైడింగ్ ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

రశీదు తప్పక తీసుకోవాలి

పోరుమామిళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదులు తీసుకోవాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టేకూరుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రస్తుతం సాగు చేసిన పంటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనగోలు చేసేటప్పుడు తప్పక రశీదులు తీసుకోవాలన్నారు. రైతు సేవాకేంద్రంకు మంజూరైన యూరియాను పంపి ణీ చేశారు. సర్పంచ్ రమణారెడ్డి, వ్యవసాయ సహాయకులు పద్మావతి పాల్గొన్నారు.



కాండం తొలిచే పురుగుపై జాగ్రత్తలు అవసరం

బి.కోడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు వరిపంట వేసేటప్పుడు వరినారు కొసలు తుంచి నాటుకోవడం వల్ల కాండం తొలిచే పురుగు గుడ్లను నాశనం చేయవచ్చని ఏడీఏ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేకవారిపల్లె, ఆనంవారిపల్లెగ్రామాల్లో పొలం పిలుస్తోందిలో భాగంగా వరిపంట పరిశీలించారు. మేకవారిపల్లె, ప్రబలవీడు, తుమ్మలపల్లె గ్రామ పంచాయతీల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కౌశిక, విస్తరణాధికారి బ్రహ్మానందరెడ్డి, షణ్ముఖ్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వరిసాగుకు పచ్చిరొట్ట ఎరువులు వాడండి

దువ్వూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పాటించాలని వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. దువ్వూరు మండలం గోపులాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులతో కలిసి నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువులుగా జీలుగ, జనుము, పిల్లిపెసర వేసుకొని పొలాన్ని కలియదున్నడం వలన 25 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. వరి పంట మొత్తం కాల వ్యవధిలో ఎకరాకు 90 కేజీలకు మించి యూరియాను వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పడకేసిన పారిశుధ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేసిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్లు వార్డు సమస్యలను మున్సిపల్ సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చినా చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు.

రోడ్డు పక్కన చెత్త తొలగింపు



చెత్తను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సెక్రటరి

ఖాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పత్తూరు కాశిరెడ్డినాయన సమీపంలో రోడ్డుపై వేసిన చెత్తను పత్తూరు సెక్రటరి శంకరమ్మ తొలగింపజేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'తీరు మారదు - శుభ్రత కనిపించదు' అన్న శీర్షికన కథనం రావడంతో సెక్రటరీ స్పందించి ఎక్స్‌కవేట ర్‌తో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సెక్రటరి మాట్లాడుతూ రోడ్డుపై చెత్త వేసిన హరిత రాయబారిని వివరణ కోరడం జరిగిందని, అలాగే హోటల్‌వారు కూడా చెత్త వేయడంతో ఆ ప్రాంతం నిండిపోయిందని మొత్తం చెత్తను తొలగించడం జరిగిందన్నారు. ఎవరైనా చెత్త వేశారని తెలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు సహకరించాలని, హరితరాయభారికి మాత్రమే చెత్తను అందించాలన్నారు.

ఆశా వర్కర్ల మహాసభలను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆశా వర్కర్స్ మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వి.సుబ్బరాయుడు, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షురాలు అనసూయలు పేర్కొన్నారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చేనెల 30, 31 తేదీలల్లో నిర్వహించే ఈ మహాసభలలో ఆశా వర్కర్ల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సంఘం పట్టణ అధ్యక్షురాలు కరుణామణి, కార్యదర్శి శ్రీదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు



జమ్మలమడుగు-గూడెంచెరువు మధ్యలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు

జమ్మలమడుగు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పల్లెలు, పట్టణాల్లో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తగా రోడ్లు వేసి ప్రజలకు సౌకర్యం కల్పించారు. అలాగే విద్యార్థినీ విద్యార్థుల ప్రభుత్వ వసతి గృహాల్లో ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు కొన్ని భవనాలు ఆధునికీకరణ చేసి వాటిని చక్కగా తీర్చిదిద్దారు. పాత బస్టాండులోని కూరగాయల మార్కెట్‌వీధి వెళ్లే రోడ్డు వెడల్పు చేసి వ్యాపారస్థులకు, వాహనదారులకు, దుకాణాదారులకు సౌకర్యం కల్పించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. వైసీపీ అధికారం అయిదేళ్ల పాలనలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లు దారుణంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు 1వ తేదీ జమ్మలమడుగు పట్టణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న సందర్భంగా ఇంకా సమస్యలుంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

లీడ్ క్యాప్ స్థలం ఆక్రమణ కాకుండా చూస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

బద్వేలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం చెన్నంపల్లె పొలం గ్రామ సర్వే నెంబరు 1580 లో మాదిగల అభివృద్ధి కొరకు కేటాయించిన లీడ్ క్యాప్ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూస్తామని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేష్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో లీడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ మాదిగ విద్యార్థులకు లీడ్ క్యాప్ సంబంధమైన చెప్పులు, బ్యాగులు తయారు చేయడంతో పాటు చర్మాలుశుద్ధి చేయుటకు ఉపయోగపడే ఈ స్థలాన్ని కొందరు వ్యక్తులు కట్టడాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలా అక్రమ కట్టడాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేదిలేదని , త్వరలో ఇక్కడ లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పిచ్చయ్య, కేశవయ్య, దళిత వేదిక జిల్లా అధ్యక్షులు ఓబయ్య, బాలయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సగిలేరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బి.కోడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్‌లో సగిలేరు గురకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ ప్రదర్శిం చారని ప్రిన్సిపాల్ నిరంజన్ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. కిక్ బాక్సింగ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడవ ఇంటర్ జిల్లా కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ నేషనల్ సెలక్షన్ జేవీఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బద్వేలులోని సరస్వతి ఇంగ్లీషు మీడియం స్కూలులో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బంగారు పతకాలని కుమార్, రామ క్రిష్ణ, మహేశ్‌బాబు, పెద్దఓబయ్య, చరణ్, ప్రేమ్‌సందీప్, చరణ్ బంగారు పతకాలు సాధించగా, వెండి పతకాలను కె.అరుణకుమార్, బెనహర్, దినేష్, హర్షవర్ధన రెడ్డి, ఎం.సుదర్శన్, కాంస్య పతకాలను గురుతేజేశ్వర్, అఖిల్ సాధించారు. మంళవారం వైస్ ప్రిన్సిపాల్ చెన్నయ్య, పీడీ శ్రీకాంత్‌రెడ్డి, సుమన్‌లతో కలిసి ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించి మరెన్నోపథకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల అక్రమాలపై నిగ్గుతేల్చాలి

ఖాజీపేట జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల అక్రమాలపై నిగ్గు తేల్చాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఉపమండలాధ్యక్షురాలు ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో జరిగే ఉపాధి హామీ పనుల్లో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని అలాంటివారిని ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ ఉపేక్షించరని అన్నారు. అలాగే యూరియా కొరత ఉందని, ప్రైవేటు డీలర్లు ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని వరి విత్తనాలు దుకాణాదారులు కుమ్మక్కై ఇష్టానుసారంగా అమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అగ్రహారం సొసైటీ చైర్మన్ హరినాథరెడ్డి, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, ఎంఈవో నాగస్వర్ణలత, ఏవో వెంకటరమణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం 42వ ఐఎస్ఏపీఎం దినోత్సవం సందర్భంగా విద్యార్థి, ఉపాధ్యాయుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైవ్‌స్టాక్ ప్రొడెక్షన్ అండ్ మేనేజ్‌మెంట్‌లో పురోగతులపై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యసాయంతోపాటు పశుపోషణకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. పశువుల పెంపకంలో వారికి తగిన మెలకువలు నేర్పించాలన్నారు. అధ్యాపకులు, పశువైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా పనిచేయండి



మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యం కోసం వన్యప్రాణులను సంరక్షించాలని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో టైగర్స్‌డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులుల సంరక్షణ కోసం ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా చర్యలు చేపట్టడంతో దేశంలో పులుల జనాభా పెరిగిందన్నారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ హేమాంజలి, కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, కోఆర్డినేటర్ గౌరీశంకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శారదా భవానీ, డైరెక్టర్ పృధ్వీనారాయణ, కోఆర్డినేటర్లు రాధా, రాజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరించుకోండి

ప్రొద్దుటూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే జరిగిన ఏడు రెవెన్యూ విలేజ్‌లలో ఉన్న జాయింట్ ఎల్‌పీఎం భూ సమస్యలను పరిష్కరించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వరాహరికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ సర్వేలో ఎలాంటి సమస్యలు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు అయిన పంట పొలాల్లో పంట నమోదు జరుగుతుందని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోకపోతే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ రాకపోవడంతోపాటు ఇన్సూరెన్స్ కూడా మంజూరు కాదన్నారు. రైతులు ఆయా వీఆర్వోల ద్వారా చలానాలు చెల్లించి భూమిని విధిగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలన్నారు.

తెలుగు సాహిత్యానికి సినారే నిలువెత్తు నిదర్శనం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి అభ్యుదయ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి నిలువెత్తు నిదర్శనమని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం జేవీవీ కార్యాలయంలో సినారాయణరెడ్డి జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినారే మూడు వేల సినిమాలకు పాటలు రాసి ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, గడియారం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

కొండాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె జడ్పీహైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు తిథిభోజనం ఏర్పాటుచేశారు. స్థానిక ఉపసర్పంచ్ వెల్లాలరఘునాథరెడ్డి తన కుమార్తె డాక్టర్‌శాంతిప్రియదర్శిని జన్మదినం సందర్భంగా 200 మంది విద్యార్థులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. మాజీసర్పంచ్ వెల్లాలరామలింగేశ్వరరెడ్డి, హెడ్మాష్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.